

# ఆమె

మాచిరాజు కామేశ్వరరావు

మరోసారి టైమ్ చూసుకున్నాడు సారధి.

ఆరు దాటి పదినిమిషాలైంది.

సుదర్శనం ఇక రాడు.

సుదర్శనం సారధి ఫిన్ని కొడుకు. ఉద్యోగ రీత్యా ఆ ఊరికి కొత్తగా వచ్చి, సారధికి ఫోన్ చేసేడు. సాయంత్రం యింటికి రమ్మన్నాడు సారధి. సుదర్శనంకి కొత్త ఊరు తెలియదు. అందుకే బస్టాండ్ దగ్గిర నిలబడి వున్నాడు సారధి.

"సరిగ్గా ఆరు లోపు వచ్చేస్తాను. నువ్వు బస్‌స్టాప్ దగ్గర ఆరుదాకా చూడు చాలు. ఆరు దాటితే నేను రానట్టే!" అన్నాడు సుదర్శనం ఫోన్‌లో.

అప్పుడే ఆరు దాటి పది నిమిషాలై పోయింది.

ఇక వెళ్ళిపోదాం—అనుకుంటున్న సారధి దృష్టి, చిరాగ్గా మొహం పెట్టుకుని రోడ్ క్రాస్ చేసి వస్తున్న 'ఆమె' మీద పడింది.

ఆమెకి పాతికేళ్ళు వుంటాయి. మనిషి పచ్చగా, పుష్టిగా వుంది. కోలమొహం, పెద్ద పెద్ద కళ్ళు—ఏదో ఆఫీసులో పనిచేసి వస్తుందేమో, మొహంలో అలసట కనిపిస్తోంది. ఆమె కట్టుకున్న రాబిన్ బ్లూ చీర, అదేరంగు బ్లవుజు నీరెండలో మెరుస్తూ ఆమె అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

ఆమె వచ్చి బస్‌స్టాప్‌లో నిలబడి ఒకసారి

నాలుగువైపులకు చూసింది.

కొంచెం ఎడంగా, ఒంటరిగా నిలబడి ఉన్న సారథి చూపులతో ఆమె చూపులు కలుసుకున్నాయి.

చిన్నగా ఆమె పెదాలు విచ్చుకున్నాయి.

ఆమె అందంగా నవ్వుతోంది—

సందేహం లేదు, తనని చూసే నవ్వుతోంది.

సారథి క్షణంపాటు నిశ్చేష్టుడై, వెంటనే అప్రయత్నంగా తనూ నవ్వాడు.

ఆమె భుజాన వున్న అందమైన బాగ్‌ను విలాసంగా సర్దుకుంటూ సారథి దగ్గిరగా వచ్చింది.

"ఎంత మారిపోయావ్ శ్యామ్! క్షణం పాటు నేను గుర్తే పట్టలేదు. ఎక్కడ ఉంటున్నావ్? ఏం చేస్తున్నావ్?" ఆమె గలగలా మాట్లాడేస్తోంది.

సారథి అయోమయంలో పడిపోయాడు.

ఆమె యింకా ఏదో అడగబోయేంతలో, "క్షమించండి, నా పేరు సారథి. మీరు నన్ను శ్యామ్‌గా పొరబడుతున్నారు...." అనేశాడు ఎలాగో.

"అయితే నన్ను చూసి ఎందుకు నవ్వారు?" ఠపీమని అడిగింది ఆమె.

ఏం చెప్పాలో తెలీక "మీరు నవ్వారని...." అంటూ నసిగేశాడు సారథి.

గలగలమని నవ్వేసింది ఆమె.

"శ్యామ్ నా క్లోజ్ ఫ్రెండ్. మేం విడిపోయి మూడేళ్ళయిపోయింది" ప్రాణస్నేహితుడికి, మనసులో దాచుకున్న రహస్యమేదో చెప్తున్నట్లు గొంతు తగ్గించి అంది ఆమె.

బదులు చెప్పడానికేం లేక చిరునవ్వు నవ్వాడు సారథి.

"మీరే శ్యామ్ అయివుంటే ఏం చేసేదాన్నో తెలుసా? ఈ క్షణంలో ఏదైనా హోటల్‌కి తీసుకెళ్ళి ఫామిలీ 'రూమ్‌లో యెవరూ చూడకుండా గట్టిగా ముద్దు పెట్టేసుకుని వుండేదాన్ని" మళ్ళీ నవ్వింది ఆమె.

ఆమె మాటలు విచిత్రంగానూ, విడ్డూరంగానూ వున్నాయి.

అయితే స్వచ్ఛమైన ఆమె నవ్వు మనసులో తలెత్తే సంశయాలని దూరం చేస్తోంది.

"సారీ! మిమ్మల్ని డిసప్పాయింట్ చేసినందుకు...." తనూ నవ్వుతూ అన్నాడు సారథి.

"నెవర్‌మైండ్! బస్ యిప్పట్లో వచ్చేలా లేదు. మీరు యెక్కడికి వెళ్ళాలి?" అడిగింది ఆమె.

"ఇంటికి—అయితే బస్‌లో కాదు. మా కజిన్‌కోసం వెయిట్ చేస్తున్నాను. మా ఇల్లు యిక్కడికి దగ్గరే!"

ఆమె ఒకసారి ఎడంచేయి పైకెత్తి టైమ్ చూసుకుంది.

అలా చూసుకోడంలోకూడా అందమైన ప్రత్యేకత వుంది.

"కాళ్ళు లాగేస్తున్నాయి. అలా హోటల్‌కెళ్ళి కాఫీ తాగి వద్దాం. కాస్త కంపెనీ యిస్తారా?"

క్షణంసేపు తటపటాయించాడు సారథి.

"మిమ్మల్ని శ్యామ్ అనుకోవడంలేదు. భయపడకండి!" ఛలోక్తిగా అంది ఆమె.

ఫక్కుమని నవ్వాడు సారథి.

ఇద్దరూ ప్రక్కనే ఉన్న హోటల్‌లోకి దారితీసారు. ఫామిలీ రూమ్ ఫుల్‌గా ఉంది. మామూలు చోటే కొంచెం ఎడంగా కూర్చున్నారు.

"ఇక్కడ కూర్చోవడమే మంచిది!" ఆమె అలా యెందుకు అందో సారథికి బోధపడలేదు.

బేరర్‌కి రెండు బ్రూ కాఫీ చెప్పాడు సారథి.

"మీరు యేం చేస్తున్నారు?" అడిగాడు సారథి.

"మీ యెదురుగుండా కూర్చుని కాఫీ కోసం ఎదురుచూస్తున్నాను!"

ఆమె జవాబు నవ్వు తెప్పించింది సారథికి.

"ఐమీన్, యెక్కడ జాబ్ చేస్తున్నారు?"

"మీరు యెక్కడ చేస్తున్నారు?"

"కెనరా బాంక్‌లో. రాష్ట్రపతి రోడ్

బ్రాంచ్" ముందు తనే చెప్పాల్సి వచ్చింది సారధికి.

"నా ఉద్యోగం చెప్పడం నాకు యిష్టంలేదు. మీరు ఏమీ అనుకోరుగా!"

అనుకుంటాను—అనడానికి సభ్యత అడ్డు వచ్చింది సారధికి. అనుకోనన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

బేరర్ తెచ్చిన కాఫీని యిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తాగారు. ఆమె చాలా చక్కగా మాట్లాడుతోంది. ఆమె నవ్వుతుంది—నవ్విస్తుంది.

ఆ నవ్వులో యెంతో ఆకర్షణ కనిపించింది సారధికి.

బేరర్ బిల్లు తెచ్చాడు.

సారధి బిల్లు యివ్వబోతుంటే ఆమె వారించింది.

"మిమ్మల్ని కాఫీకి పిలిపించింది నేను!" బలవంతంగా బేరర్‌కి రెండు రూపాయలనోటు ఇచ్చి లేచింది.

"మగవాడు వుండగా ఆడవాళ్ళు బిల్లు చెల్లించడం బాగుండదు" నొచ్చుకుంటూ అన్నాడు సారధి.

"ఆడది కూడా సంపాదిస్తున్నప్పుడు ఆడ మగ భేదం ఏముంది?"

సారధి మరి మాట్లాడలేదు.

ఇద్దరూ హోటల్ బయటికి వచ్చారు.

ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి.

"వర్షం వచ్చేలా ఉంది" ఆకాశంవైపు చూస్తూ అన్నాడు సారధి.

"మబ్బులన్నీ వర్షించవు. అన్నట్లు మీ యిల్లు యిక్కడికి దగ్గిరే అన్నారుగా, నాకు చూపించరూ?"

సారధి గుండె ఝల్లుమంది. ఈమె ఈ వాతావరణంలో ఇంటికి వస్తుందా? ఇంట్లో జ్యోతి కూడా వుంది!

"మా శ్రీమతి కాఫీపొడెం తెమ్మంది. మర్చేపోయాను!" ఇంట్లో తన శ్రీమతి కూడా వుందని ఆమెకి తెలియడానికి డొంకతిరుగుడుగా అన్నాడు సారధి.

"అయితే ఆలస్యం యెందుకు? కాఫీపొడెం కొనండి."

ఇక ఆమె వదిలేలా లేదు. అవసరం లేక పోయినా కాఫీపొడెం కొన్నాడు సారధి. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"మీ శ్రీమతికి నన్ను ఏమని పరిచయం చేస్తారు?" హఠాత్తుగా అడిగింది ఆమె.

"ఏమని చేస్తాను? జరిగింది చెప్తాను."

"గంట పరిచయంలో యింటికి వచ్చారంటే ఆవిడ నమ్ముతారా?"

"మీరు వస్తున్నారుగా!"

"అందరూ నాలా ఉంటారా?"

సారధి జవాబు చెప్పే అవసరం లేకుండా ఇల్లు వచ్చేసింది.

సారధి తలుపు తట్టాడు.

వంటింట్లోంచి తిన్నగా వచ్చి తలుపు తీసింది జ్యోతి. పేరు జ్యోతి అయినా ఆమె మరకలతో, జిడ్డు మొహంతో జ్యోతి క్రింద వుండే ప్రమిదలా పొట్టిగా లావుగా వుంది.

భర్త పక్కన వున్న అందమైన అమ్మాయిని చూడగానే ఆమె కంగారు పడి "రండి, రండి!" అంటూ తను పక్కకి తప్పుకుంటూ దారి ఇచ్చింది.

ఆమె వచ్చి ముందు గదిలోనే ఉన్న కుర్చీలో కూర్చుంది.

జ్యోతి లోపలికి వెళ్ళిపోయింది.

"మా ఇల్లు మామూలుగా ఉంటుంది" మొహమాటపడుతూ అన్నాడు సారధి.

"నాకు మాత్రం చాలా బావుంది" మనస్ఫూర్తిగా అంది ఆమె.

జ్యోతి మొహం కడుక్కొని, చీర మార్చుకొని రెండు గ్లాసులతో కాఫీ పట్టుకొని వచ్చింది.

"కాఫీ చూస్తే ప్రాణం లేచి వచ్చినట్లుగా ఉంది. ఎప్పుడో మధ్యాహ్నం తాగిన కాఫీ!" గ్లాసు అందుకుంటూ అంది ఆమె.

ఆమె తాము హోటల్లో కాఫీ తాగి వచ్చాం అని యెక్కడ చెప్తుందో అని హడలిపోతున్న సారధి తేలిగ్గా నిట్టూర్చి, తనూ భార్య చేతి

లోంచి కాఫీ అందుకుంటూ "ఈవిడే మా శ్రీమతి" అన్నాడు ఆమెతో.

ఆమె కాఫీగ్లాసు కిటికీలో పెట్టి "నమస్కారం" అంటూ చేతులు జోడించి, మళ్ళీ గ్లాసుని చేతిలోకి తీసుకుంది.

ఆమెని ఏ విధంగా పరిచయం చెయ్యాలో తెలియని సారధి మౌనంగా ఉండిపోయాడు.

ఆమె కాఫీ తాగేసి, "వెదర్ ఎలా ఉందో?" అంటూ తలుపు తీసి చూసింది.

అవతల మబ్బులు కమ్ముకుంటున్నాయి.

"పెద్ద వర్షం వచ్చేలా వుంది" అన్నాడు సారధి.

"నాకు వర్షం అంటే చచ్చేంత భయం" అంటూ మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంది.

ఆమెతో భార్య ముందు కులాసాగా నవ్వుతూ మాటాడటం యిబ్బందిగా అనిపించింది సారధికి.

వర్షం ప్రారంభం అయ్యాక, ఒకసారి కిటికీలోంచి లేచింది ఆమె.

"అయ్యో, తుప్పర పడుతోంది. కాస్సేపు కూర్చోండి" అంది జ్యోతి.

"ఫరవాలేదు" నెత్తిమీదుగా కొంగు కప్పుకొని ఆ తుప్పరలో తడుస్తూ వెళ్ళిపోయింది ఆమె.

"ఎవరండీ ఆవిడ?" ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయిన సారధి నుద్దేశించి కుతూహలంగా అడిగింది జ్యోతి.

ఒక్క మాటలో చెప్పడానికి కుదరక, జరిగినదంతా చెప్పాల్సి వచ్చింది సారధికి.

"ఒక్క గంట పరిచయంతో యింటికి వచ్చిందా? నేను నమ్మను" ఆమె కళ్ళ నిండా అనుమానం.

"నమ్మకపోతే నీ ఖర్మ. అదే నిజం!" చికాగ్గా అన్నాడు సారధి.

జ్యోతి కళ్ళలో చివ్వున నీళ్ళు చిమ్మాయి.

* * *

వారం రోజుల తర్వాత సారధి బాంక్ అడ్రస్‌కి ఒక వుత్తరం వచ్చింది. అపరిచితమైన దస్తూరి!

ఫ్రమ్ ఎడ్రస్ లేదు. ఆత్రుతగా కవరు చింపి సంతకం చూశాడు.

"ఆమె" అని ఉంది.

ఆమె యెవరో సారధికి అర్థం అయిపోయి గబగబా చదవసాగాడు.

"సారధిగారూ,

మీరు కొత్త దస్తూరిని చూడటంవల్ల ముందు సంతకం చూస్తారని నాకు తెలుసు. మీకు నా పేరు తెలియదు గనుక 'ఆమె' అనే నా గురించి అనుకుంటారనీ తెలుసు! (అది, ఇది—అని అసహ్యంగా అనుకునే సంస్కారహీనులు కారనే నమ్మకం.) అందుకే అలా సంతకం పెట్టాను.

సారధిగారూ, ఆరోజు నా ప్రవర్తన విచిత్రంగా అనిపించింది కదూ? నా గురించి చెడ్డ అభిప్రాయం ఏర్పడే అవకాశం కూడా ఉంది. నేను ఆ రోజు యెందుకలా ప్రవర్తించానో రాస్తున్నాను, కాస్త ఓపిగ్గా చదువుతారని భావిస్తున్నాను.

నేను కాలేజీలో చదివే రోజుల్లో శ్యామ్‌ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. శ్యామ్ కూడా నన్ను ప్రేమించాడనే భ్రమ పడ్డాను. ఇద్దరం సినిమాలు, కథల ప్రభావంవల్ల షికార్లు, సినిమాలు అంటూ తెగ తిరిగాం. నేను ఫైనలియర్ పరీక్షలు వ్రాసి మా ఊరు వెళ్ళిపోయాను.

ఒకరోజు నాకు ఏదో శుభలేక వచ్చింది— శ్యామ్ పెళ్ళి అని! ఒక లక్షాధికారి కూతురితో అతని పెళ్ళి అంతక్రితం రోజే జరిగిపోయింది.

వెంటనే వెళ్ళి శ్యామ్‌ని కలుసుకున్నాను.

నా కన్నీళ్ళకి అత నిచ్చిన జవాబేమిటో తెలుసా?

"కాలేజీ లైఫ్‌లో ఒక అందమైన గర్ల్ ఫ్రెండ్ ఉండటం మగవాడికో గొప్ప! అందుకే నీతో స్నేహం చేశాను. నిన్ను పెళ్ళి చేసుకుంటానని యెప్పుడైనా అన్నానా? అందమైన బీద భార్యకన్నా, అనాకారి ఐన లక్షాధికారి కూతురు భార్య అవడం మంచిది. డబ్బుతో

[illegible]

ఆ పశువు మొహం చూడటానికే అసహ్యం వేసింది. వెనక్కి తిరిగి వచ్చేసాను. ఆ షాక్ నుంచి నే నింకా తేరుకోనేలేదు. ఇంతలో వుద్యోగ రీత్యా నేను హైద్రాబాద్ వచ్చాను.

నెల క్రితం అబిడ్స్‌లో అనుకోకుండా శ్యామ్ కనిపించాడు.

ఆ రోజు నుంచీ నా వెంట పడుతున్నాడు.

ఒక రోజు నాకు ఫోన్ చేసి "సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్‌కి 'రావా?' అన్నాడు.

"ఎందుకు?" కటువుగా అడిగాను నేను.

"ఎందుకేమిటీ, సరదాగా తిరుగుదాం! అయినా నా అంత అందమైన బాయ్ ఫ్రండ్ ఉన్నాడని చెప్పుకోవడం నీకు మాత్రం గొప్ప కాదూ?" వెకిలిగా నవ్వాడు.

"షటప్, ఇది ఫోన్ కాబట్టి బతికిపోయావ్! ఎదురుగుండా వుంటే దవడ పేలిపోయి వుండేది. నీకన్నా వెయ్యిరెట్లు అందగాడూ, నీకు లేని మంచి మనసు వున్నవాడూ ఇప్పటి నా ఫ్రెండ్. అంతే కాదు, నీ వెర్రివేషాల గురించి చెప్తే ఒక దెబ్బతో నిన్ను మట్టికరి పించ గలిగేంత బలమైనవాడు కూడా! మైండిట్! డోంట్ ట్రై టు ప్లే విత్ ఫైర్!" చాలా స్ట్రాంగ్ డోస్ యిచ్చి, ఫోన్ పెట్టేసాను.

కానీ తర్వాత కూడా నన్ను వెంబడించడం మానలేదు అతను. బహుశా నా యిప్పటి ఫ్రెండ్‌ని చూసి, నేను చెప్పిన మాటలు, నిజమో కాదో తేల్చుకోవడానికి కావచ్చు!

ఆ రోజు కూడా ఆఫీసు నుంచి వస్తుంటే నా వెనకే వస్తున్నాడు అతను.

బస్‌స్టాప్‌లో మిమ్మల్ని చూడగానే నాకు శ్యామ్‌ని వదిలించుకునే ఉపాయం తట్టింది. మీరు శ్యామ్ కంటే చాలా అందంగా, స్ట్రాంగ్‌గా వుంటారు. మర్యాదస్తులుగా కూడా కనిపించారు నాకు.

మనం నవ్వుకుంటూ మాట్లాడుకోవడాన్ని, మాడిపోతున్న మొహంతో చూస్తున్న శ్యామ్‌ని చూస్తే నాకు ఇంకా విరగబడి నవ్వా లనిపించింది.

అతన్ని యింకా ఏడిపిద్దామనే మిమ్మల్ని హోటల్‌కి తీసుకెళ్ళాను. అతనూ హోటల్‌లోకి వచ్చాడు. మళ్ళీ అతను వెంబడిస్తాడనే మీతో మీ యింటికి వచ్చాను. కాస్సేపు మీ యింటి ముందు తచ్చాడి, అతను వర్షం వచ్చేలా వుందని కాబోలు, వెళ్ళిపోయాడు. మనిద్దరం కలిసి హోటల్‌కి వెళ్ళడం, నేను మీ ఇంటికి రావడంతో నేను చెప్పిన బాయ్‌ఫ్రెండ్ మీరే నని అతనికి రూఢి అయిపోయినట్లుంది. ఈ వారంలో మళ్ళీ ఫోన్ చేయలేదు. ఇక ఆ ప్రయత్నం చేయడనే భావిస్తున్నాను.

నా విషయమై మీ భార్యా భర్తలమధ్య ఏవైనా అపోహలు కలిగివుంటే క్షంతవ్యురాల్ని. ఈ ఉత్తరం మీ శ్రీమతికి కూడా చూపించండి. ఆవిడ మనసులో ఏ మాత్రమైనా అనుమానం యేర్పడి వుంటే అది క్లియ రౌతుంది.

మీరు చేసిన సహాయానికి థాంక్స్ చెప్పాలో, మిమ్మల్ని యిబ్బంది పెట్టినందుకు సారీ చెప్పాలో అర్థం కావడంలేదు. నా పేరు చెప్పాల్సిన అవసరం లేదని చెప్పడం లేదు. మరోలా భావించరుగా,

—ఆమె."

